సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

ఒంటిమిట్టలోని రామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రఘు రాముడికి ఉత్సవ నిర్వాహకులు పవిత్రమాలలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. -8లో..



'నా పిల్లల బాధ చూడలేను'..

పిల్లల ఆరోగ్యంపై బెంగ పెట్టుకున్న ప్రొద్దుటూరులోని నడింపల్లెకు చెందిన పోతినేని ప్రసాద్(32) ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. -8లో..

గరిష్టం/కనిష్టం
35.4/25.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.8 – 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

ఆశల పైర్లు...కాసుల ఊర్లు!

నేలమ్మనే నమ్ముకున్న రైతులు 'ఏటీఎం' అనే కొత్త రకం సాగుకు శ్రీకారం చుట్టారు. తక్కువ ఖర్చు.. ఎక్కువ రాబడే లక్ష్యంగా 'ప్రకృతి వ్యవసాయా'నికి నాంది పలికారు. ప్రతికూల వాతావరణాన్నే తమకు అనుకూలంగా మార్చుకుని పంట చేలల్లో 'తీగల్లా' అల్లుకుపోయారు. రైతన్న ఆశకు.. ఆశయానికి పుడమి తల్లి మురిసిపోయింది. తమ ఒడిలో ఒదిగిపోయిన కర్షకులను చూసి ప్రకృతి సైతం చల్లగా దీవించింది. 'నిన్న బెండ.. ఇయ్యాల బీర.. రేపు మటిక...' ఇలా నిత్యం కోతలతో 'ఆశల పైర్లు' వేళ్లూనుకుపోయాయి. ఏడాదంట కాసుల గలగలతో ఊర్లు కళకళలాడుతున్నాయి.

- ఏటీఎం మోడల్‌లో వివిధ కూరగాయల పంటలసాగు
- రోజువారి ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా అడుగులు
- ఏడాదంతా కాసులపంటే... ఆనందంలో అన్నదాతలు



కూరగాయలను కోస్తున్న మహిళా రైతు



ఈమె పేరు లక్ష్మీదేవి. వైఎస్సార్ జిల్లా కామనూరు గ్రామం. ఈమె తనకున్న 80 సెంట్లలో ఏటీఎం మోడల్లో మిరప, టమాట, అనప, కాకరతోపాటు పలు రకాల పంటలను సాగు చేశారు. ఈ పంటల సాగుకు సేద్యం, విత్తనాలు, కూలీలు అన్ని కలుపుకుని రూ. 8 వేలు ఖర్చు అయింది. పైగా పంటలకు కావాల్సిన ఘన, ద్రవ జీవామృతం సొంతంగా తయారు చేసుకుంటారు. ప్రస్తుతం కోతలు ప్రారంభమయ్యాయి. మొదటి కోతలోనే రూ. 2 వేలు రాబడి వచ్చింది. తర్వాత మరో రెండు కోతలను కోశారు. అంతా కలిపి ఇప్పటి వరకు రూ.8 వేలదాకా వచ్చింది. ప్రకృతి సేద్యాన్ని నమ్ముకోవడంతో లాభాలు కళ్ల జూస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఈయన పేరు రమణయ్య. వైఎస్సార్ జిల్లా లింగాల మండలం బోనాల గ్రామం. ఈయన 40 సెంట్లలో ఏటీఎం మోడల్లో 30 రకాల కాయకూరలు,తీగ కూరలను సాగు చేశారు. ఈ 40 సెంట్లసాగుకు సుమారు రూ. 4800 ఖర్చు అయిందంటున్నారు. సాగు చేసి రెండు నెలలు అయింది. ప్రస్తుతం కొన్ని కూరగాయలు కోతలు ప్రారంభం అయ్యాయి. ఇప్పటి వరకు 1050 వచ్చింది. ఇక ముందు ముందు కోతలు తెటి ఆదాయం మంచిగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కడప అగ్రికల్చర్: వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రతికూల వాతావరణాన్నే తమకు అనుకూలంగా మార్చుకుని రైతులు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఈ ఏడాది నూతనంగా ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఏటీఎం(ఎనీ టైం మనీ) మోడల్లో భాగంగా ప్రతి 20 నుంచి 30 సెంట్లలో 25 రకాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలతోపాటు తీగజాగి కాయ పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. కుంటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

సాగు చేసిన 45 రోజుల నుంచే...

ఏటీఎం మోడల్లో సాగు చేసిన పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసిన 45 రోజుల నుంచే దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. ఏడాది పొడుగునా రకరకాల కూరగాయలు వాటి పంట కాలం బట్టి దిగుబడి వస్తూ ఉంటాయి. ఫలితంగా నిత్యం కోతలే.. రోజూ కాసుల గలగలలే వినిపిస్తుంటాయి. ప్రస్తుతం జిల్లాలో ఈ ఏటీఎం మోడల్లో వేముల, వేంపల్లి, లింగాల, పెండ్లిమర్రిలతోపాటు పలు మండలాల్లో పలువురు రైతులు కూరగాయ పంటలను సాగు చేసి లాభాల బాటలో పయనిస్తున్నారు.

ఏయే పంటలను సాగు చేస్తారంటే...

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 78 ఏటీఎం మోడల్ కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. ఈ ఏటీఎం మోడల్ కింద టమాట, వంగ, మటిక, మిరప, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్‌లతోపాటు గోంగూర, పాలకూర, మెంతాకు, కొత్తిమీర వంటి ఆకు కూరలతోపాటు తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సొర, చిక్కుడు వంటివి సాగు చేస్తున్నారు. వీటిలో కొన్ని కూరగాయలు సాగు చేసిన 25 నుంచి 30 రోజులకు కోతలు ప్రారంభమవుతాయి. మరి కొన్ని 45 రోజులకు ఇంకొన్ని 90 రోజులకు దిగుబడి వస్తుంది. ఇలా ఏడాదంతా కూరగాయలను పండించుకుంటూ డబ్బులను సంపాదిస్తున్నారు.

జిల్లాలో సాగైన ఏటీఎం మోడల్ సంఖ్య వివరాలు...

కడప	:	14
ముద్దనూరు	:	16
మైదుకూరు	:	09
పోరుమామిళ్ల	:	05
పులివెందుల	:	24
పొద్దుటూరు	:	04
బద్వేల్	:	04
కమలాపురం	:	02
మొత్తం	:	78

ఉన్న ఊర్లోనే...

తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన కాయగూరలు, ఆకుకూరలను తమ ఉన్న గ్రామంలోనే మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా కిలో చొప్పున వినియోగదారులకు అందిస్తున్నారు. వీటితోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం కషాయలు, జీవామృతం, ఘనామృతంలోనే పండించే కూరగాయలు కావడంతో ప్రజలు వీటిని తీసుకునేందుకు బాగా ఆసక్తి కనబరుస్తున్నారని రైతులు తెలిపారు. అందులో ఉన్న ఊర్లో కళ్లెదుటే పండిన కూరగాయలు కాబట్టి తాజాగా ఉండటంతో అందరూ కొంటున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆసక్తిగా సాగు చేస్తున్నారు...



ఈ ఏటీఎం మోడల్లో కూరగాయలు, కాయగూరలు, ఆకుకూరలు సాగు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగు... పైగా ఖర్చు కూడా తక్కువగా ఉండటంతో చాలా మంది సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 78 ఏటీఎం మాడల్స్‌ను సాగు చేశారు. ఇంకా సాగు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. మేము కూడా మా సిబ్బందితో ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాం. – రామకృష్ణరాజు, జిల్లా ప్రాజెక్టు అధికారి, ప్రకృతిసేద్యం

రాబడి బాగుంది..



ఏటీఎం మోడల్లో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలతో రాబడి బాగుంది. బెండ, మటిక బీరకాయలను కిలో రూ. 30తో అమ్ముతున్నాను. దీంతోపాటు గోంగూర కట్ట 5 రుపాయలతో అమ్ముతున్నాను. ముల్లంగి మాత్రం కిలో రూ. 40 తో అమ్ముతున్నాను. ఇలా ఇప్పటి వరకు రూ. 2500 మచ్చింది. ఇంకా 5 నెలల వరకు పంట ఉంటుంది. రాబడి బాగుంటుంది.
– ఉమాదేవి, గొల్లలగూడూరు. వేముల మండలం.

ఇంకా కోతలు ప్రారంభంకాలేదు..



ఏటీఎం మోడల్లో సాగు చేసిన కూరగాయల పంట ఇంకా కోతకు రాలేదు. వంగ, అనప. ఆలసంద, చిక్కుడు, మటిక పంటలు పూతదశలో ఉన్నాయి. ఈ పంటలు కొత ప్రారంభమైతే డబ్బుల రాబడి ప్రారంభమవుతుంది. దీంతోపాటు బార్డర్‌పంటగా కంది, సొద్ద పంటలను సాగు చేశాను. – సునితా, గొందిపల్లె, వేంపల్లి మండలం.

జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తస్థాయిలో అందాలని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఎల్లవేళలా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజులు ఆకాంక్షించారు. ఈ నెల 18న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని... వారు ఆదివారం ఒక ప్రకటనలో.. జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

- వినాయక చవితి సందర్భంగా.. ఆ మహాగణపతి ఆశీస్సులతో.. ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జేసీ గణేష్ కుమార్, జిల్లాలోని ఎం.ఎల్.సీలు సి. రామచంద్రయ్య, డీసీ గోవిందరెడ్డి, పి. రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, డా. దాసరి సుధ, డా. సుధీర్‌రెడ్డిలు జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

2.6 కిలోల వెండి వితరణ



ఆలయ చైర్మన్ వెండిని అందజేస్తున్న దాతలు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని శ్రీ అంకాలమ్మ ఆలయంలో గర్భగుడి ముఖ ద్వారానికి సంబంధించి వెండి తోరణం ఏర్పాటు చేసేందుకు 2.6 కిలోల వెండిని వితరణగా అందజేశారు. పట్టణానికి చెందిన మిట్టా వెంకటనారాయణశెట్టి, ఈశ్వరమ్మల కుమారుడు మిట్టా మల్లికార్జునశెట్టి జ్ఞాపకార్థం మిట్టా నాగమునెమ్మ కుటుంబ సభ్యులు, కడియాల నాగసుబ్బరాయుడు ధర్మపత్ని సరోజమ్మ కుటుంబ సభ్యులు అర్చకులు, ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్‌లకు వెండిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రసాదాలు అందజేశారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి



వేణుగోపాలస్వామి ఆలయ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి తదితరులు

అట్లూరు: ఎర్రచంద్రనం అక్రమరవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని అటవీసిబ్బందికి కడప డీఎఫ్‌ఓ పీవీ సందీప్‌రెడ్డి సూచించారు.ఆదివారం శ్రీలంకమల్లేశ్వర అభయారణ్యం పరిధిలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి(కొండగోపాలస్వామి)ఆలయ ప్రదేశాన్ని సిద్దవటం రేంజ్‌అధికారిణి బి.కళావతి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు ఏకో టూరిజం పార్కు ఏర్పాటుకు సాధ్యాసాధ్యలపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ గమనించిన అంశాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. సిద్దవటం సెక్షన్ అధికారి సురేష్‌బాబు, మద్దూరు, కొండూరు బీట్ గార్డులు దీపికా, విశ్వనాధరెడ్డి, ఏబీఓలు నారాయరెడ్డి, మరియూ ప్రొటక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరం చిన్నచౌకులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ క్రీడామైదానంలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం నిర్వహించిన ఈ పోటీలను జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు, పాఠశాల డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్‌ఆర్ట్స్ సాధన చేయడం ద్వారా చిన్నారుల్లో చురుకుదనం పెరుగుతుందన్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. తైక్వాండో అసోసియేషన్ అన్నమయ్య జిల్లా చైర్మన్ రవిశంకర్‌రాజు, వైస్ చైర్మన్ సునీల్, ఉపాధ్యక్షులు దామోదర్‌రాజు, వసీం, గణేష్, పరిశీలకుడు కొన్నిపాటి వెంకటేష్, రెఫరీలు కృష్ణవంశీగౌడ్, మహేష్‌బాబు, ఫజిల్‌బాషా, రేవంత్‌రెడ్డి, తేజస్విని, లోకనితిన్, సాయియోగేష్ పాల్గొన్నారు.

పులివెందుల కీర్తిపతాకంలో

మరో కలికితురాయి

- సైనిక్ స్కూల్‌కు ఎంపికైన నల్లపురెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్
- నేవీ, ఎయిర్‌ఫోర్స్, మిలటరీ ఉద్యోగాల కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు



సైనిక్ స్కూల్‌కు ఎంపికైన నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

కడప ఎడ్యుకేషన్/పులివెందుల రూరల్: పులివెందుల కీర్తిపతాకంలో మరో కలికితురాయి చేరింది. కేంద్ర రక్షణశాఖ దేశవ్యాప్తంగా సైనిక్ స్కూళ్ల ఎంపికలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సైనిక్ పాఠశాల నిర్వహణ సంస్థ రెండు కేటగిరీలుగా పాఠశాలలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులో గ్రీన్ ఛానల్, ఎల్లో ఛానల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయనుంది. ఇందులో గ్రీన్ ఛానల్ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు, బోధన, పాఠశాల, హాస్టల్ నిర్వహణ అన్నింటినీ సైనిక విభాగం వారు చూసుకుంటారు. ఎల్లో ఛానల్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండింటి ఉమ్మడి బాధ్యతలు ఉంటాయి. ఇక్కడ హాస్టల్ సౌకర్యం ఉండదు. విద్యార్థులకు డ్రిల్, శిక్షణా శిబిరాలు, టైం టేబుల్ బోధన మొదలగునవి రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారిని సైనిక్ విభాగంలో ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా 100 సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా వైఎస్సార్‌జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలను సైనిక్ పాఠశాలగా ఎంపిక చేసింది. పులివెందుల ప్రాంత ప్రజలకు సైనిక ఉద్యోగాల కల్పనకు సైనిక్ పాఠశాల ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో విజయనగరం జిల్లాలోని కోరుకొండ వద్ద సైనిక్ పాఠశాల ఉండేది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలంలో నెలకొల్పాల్సి ఉండేది. ఆయన మరణానంతరం కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆయన నియోజకవర్గంలోని కలికిరిలో సైనిక్‌పాఠశాల ఏర్పాటు అయింది. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెలో సైనిక్ స్కూల్ ఏర్పాటు కానుండటంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు...



మా పాఠశాలను సైనిక్ స్కూల్‌కు ఎంపిక చేయడం హర్షణీయం. దీంతో ఏపీలోనే మా పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. – కమలనాథశర్మ, ప్రధానోపాధ్యాయుడు, నల్లపురెడ్డిపల్లె

ఆర్మీ సెలెక్షన్స్ జరపొచ్చు



ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, కలికిరి ప్రాంతాల్లో ప్రస్తుతం సైనిక్ స్కూళ్లు ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సైనిక్ స్కూల్‌గా ఎంపిక చేయడం గొప్పవిషయం. ఈ పాఠశాలల నుంచి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సు ఉద్యోగాలకు ఎంపిక ఉంటుంది. – వీరారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి, పులివెందుల

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై క్రీడాకారులు

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో మంచి ప్రతిభ కనబరిచిన 22 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారిలో మహేంద్ర, అభిలాష్, రోహన్,అబ్రహాం, డేవాంగ్, మహేష్‌బాబు, పవన్‌కుమార్, భాను, ఖాదర్‌వల్లి, రాజేష్, గణేష్, మనోజ్, ఫయాజ్, జోషఫ్, శశి, మంజు, హరి, అరవింద్, సంజీవ్, సైసావల్లి, మహమ్మద్ సాహిద్, రెడ్డి ప్రసాద్ ఉన్నారు.ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20న నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫుట్ అసోసియేషన్ జిల్లా సభ్యులు దిలీప్, సాగర్, మురళీధర్‌లు తెలిపారు. కార్యక్రమంలో కమలేష్, మహేంద్ర, అబ్రహం పాల్గొన్నారు.

ఘననాథ...నమో నమామి!



కడప: ఎన్జీఓ కాలనీలో తుది దశలో పందిరి నిర్మాణం



కొలువుదీరనున్న భారీ వినాయక విగ్రహం

- నేడు వినాయక చవితి
- పూజలకు సిద్ధమైన పందిళ్లు

కడప కల్చరల్ : ఆది పూజల దేవుడు, ఆది దంపతుల ముద్దుల కుమారుడు, విఘ్నాధిపతి వినాయకుని ఉత్సవాలను నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భారీ గణపతి విగ్రహాలను వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాలకు చేర్చారు. సోమవారం ఉదయం 9.00 గంటల నుంచి 10.30 గంటల్లోపుగా ప్రతిష్ట, పూజలు నిర్వహించాల్సి ఉందని పండితులు చెప్పడంతో ఈ మేరకు పందిళ్లను సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచే విగ్రహాలను కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకున్న పందిళ్లకు చేర్చారు. దీంతో ప్రధాన రోడ్లన్నీ సందడిగా మారాయి. గణపతిని తీసుకు వెళ్లే లారీలు, ట్రాక్టర్లు, ఉత్సాహం ఉరకలేస్తున్న యువకుల కేకలతో మారుమోగాయి. సాయంత్రం ఒక దశలో విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలతో అక్కడక్కడ స్వల్పంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమ నిర్వాహకులైన యువత నుదుటికి 'జై వినాయక', 'గణపతి బొప్ప మోరియా'అని రాసి ఉన్న కాషాయ రిబ్బన్లు కట్టుకుని ఉత్సాహంతో నినాదాలు చేస్తూ పందిళ్ల వద్ద హడావుడి చేశారు. నిమజ్జనం వరకు ఉదయం, సాయంత్రం పూజలు జరిగేలా ఏర్పాటు చేసుకున్నారు. పందిళ్లను కనువిందుగా అలంకరించారు.

- జిల్లాలో మొత్తం దాదాపు మూడున్నర వేలకు పైగా పెద్ద విగ్రహాలను పందిళ్లలో ప్రతిష్ఠించనున్నారు. కడప నగరంలోకూడా దాదాపు 350 విగ్రహాలు పూజలు అందుకునేందుకు సిద్ధమయ్యాయి. ఒక్కో విగ్రహానికి రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల దాకా వెచ్చించారు. కేవలం కడప నగరంలోనే భారీ విగ్రహాలు, సెట్టింగుల్లాంటి పందిళ్ల నిర్మాణాలకు రూ. 3–4 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. జిల్లా అంతటా రూ. 40–50 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. రాజీవ్ మార్గ్‌లోని పార్కు ఎదుట విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పందిరి రాజభవనాన్ని తలపిస్తోంది. దీంతోపాటు ఎన్జీఓ కాలనీలో, చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పందిళ్లు కూడా ఆకట్టుకుంటున్నాయి.

సందడే సందడి

జిల్లా అంతటా పండుగ సందడి కనిపించింది. పట్టణాలు, మండలాల కూడళ్లలో భక్తులు పండుగ నిర్వహణ కోసం చిన్న విగ్రహాలతోపాటు గణపతి పూజలో ఉపయోగించే అరటి పిలకలు, మామిడికాకులు, పత్రి, వెలగపండ్లు, మొక్కజొన్న కంకులు తదితర వస్తువుల కొనుగోళ్లలో హడావుడిగా కనిపించారు. డిమాండుతోపాటు ఈ వస్తువుల ధరలన్నీ పెరిగాయి.

ఘనంగా పెద్దదర్గా ఉరుసు



ఆశీర్వాదం పొందుతున్న భక్తులు

కడప కల్చరల్ : ప్రముఖ ఇస్లాం ఆధ్యాత్మిక క్షేత్రం కడప పెద్దదర్గాగా పేరుగాంచిన అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ పక్షాన దర్గా ప్రతినిధులు గంధం కలశంతో ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో గంధాన్ని సమర్పించారు. ఫాతెహా చేసి భక్తులందరికీ పంచి పెట్టారు. ఉరుసుకు వచ్చిన భక్తులకు నజ్ముల్ అమీన్ పబ్లిక్ హైస్కూలు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రత్యేకంగా తయారు చేసిన తీపి పదార్థాలను ప్రసాదంగా అందజేశారు.

భక్తుల సందడి

ఆదివారం నాటి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దర్గా నిర్వాహకులు వసతి సౌకర్యంతోపాటు భోజన సౌకర్యం కల్పించారు. దర్గా ఆవరణాన్ని విద్యుత్ దీపాలతో కనుల పండువగా అలంకరించారు. ఉరుసు సందర్భంగా రాత్రి ప్రముఖ గాయకులు, నాగపూర్‌కు చెందిన అబ్దుల్ హబీబ్ అజ్మీరి ఆధ్వర్యంలో ఖవ్వాలీ కచేరి భక్తులను అలరించింది.



విద్యుత్‌దీప కాంతుల్లో కడపలోని పెద్దదర్గా

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


ఆదినారాయణరెడ్డి (ఫైల్)

లింగాల : మండల పరిధి అంబకపల్లె గ్రామానికి చెందిన కేతిరెడ్డి ఆదినారాయణరెడ్డి (39) ఈనెల 10వ తేదీన పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు కార్తీక్‌రెడ్డి, కుమార్తె చేతన ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పోలీసుల నాకాబందీ


రామేశ్వరంలో విచారణ చేస్తున్న పోలీసులు

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం, రామేశ్వరం ఎస్టీ కాలనీల్లో ఆదివారం రాత్రి సీఐ చిరంజీవి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అక్కడ చెడునడత, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి ఇళ్లను పరిశీలించారు. వారి కుటుంబాలకు హెచ్చరికలు చేశారు. రామేశ్వరంలో ఎర్రచందనం స్మగ్లింగ్, నాటు సారాలో పాత్ర ఉన్న వారి గురించి ఆరా తీశారు. వారు ఎక్కడ ఉన్నదీ, ఏమి చేస్తున్నదీ విచారణ చేశారు.

శభాష్ పోలీస్


యువకుడిని తీసుకొస్తున్న హోంగార్డు శ్రీనివాసులు

కడప అర్బన్ : ఆత్మహత్య చేసుకోబోతున్న ఓ యువకుడిని పోలీసులు కాపాడి శభాష్ అనిపించుకున్నారు. కడప నగర శివారులో చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన ఓ యువకుడు కుటుంబ కలహాలతో తండ్రితో గొడవపడి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. బ్లూకోల్ట్స్ విధుల్లోని హోంగార్డ్ డి.శ్రీనివాసులు శిల్పారామం వద్ద వెళ్తుండగా.. రైల్వేట్రాక్‌పై యువకుడు అనుమానాస్పదంగా వుండటంతో అక్కడికి వెళ్లాడు. యువకుడికి కౌన్సెలింగ్ నిర్వహించి మనోస్థైర్యం కల్పించాడు. తల్లికి యువకుడిని కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ పోలీసులు అప్పగించారు. తన కుమారుడిని కాపాడిన పోలీసుశాఖకు జీవితాంతం రుణపడి వుంటామని బాధిత యువకుడి తల్లి కృతజ్ఞతలు తెలియజేసింది. బ్లూకోల్ట్స్ హోంగార్డ్ శ్రీనివాసులును జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అభినందించారు.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ


పవిత్రమాలలను ఉత్సవ మూర్తులకు సమర్పించిన పండితులు


పవిత్ర మాలలను సమర్పణకు తీసుకువస్తున్న వేదపండితులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలోని కోదండ రామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం టీటీడీ ఆలయ అధికారుల ఆధ్వర్యంలో రఘురాముడికి ఉత్సవ నిర్వాహకులు వీణారాఘవాచార్యులు పవిత్రమాలలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. సీతారామలక్ష్మణ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. యాగశాలలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, ద్వార తోరణ, కుంభబింబ ఆరాధన, అగ్ని ప్రతిష్ట, పవిత్ర దేవతా హోమం, పంచసూక్త పరివార హరణం, పవిత్ర సమర్పణ, లఘు పుర్ణాహుతి, చతుర్వేద స్వసి, తీర్థప్రసాద వినియోగం, వితరణ పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. సీతా రామలక్ష్మణ మూర్తులు, ద్వార పాలకులు, ధ్వజస్తంభం, బలిపీఠం, గర్భగుడి గోపురం, భక్త సంజీవరాయస్వామికి పవిత్ర మాలలతో అలంకరణ చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రామయ్యను దర్శించుకున్నారు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి ప్రాకారోత్సవం ఉంటుంది.

పండగ కోసం వచ్చి కడతేరాడు

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం


మృతి చెందిన సురేంద్రరెడ్డి

బి.కొత్తకోట : వినాయక చవితి పండగను స్వగ్రామంలో జరుపుకొనేందుకు ఇంటికి వచ్చిన ఓ యువకుడు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం ఎగువ శీతివారిపల్లెకు చెందిన ఎస్.సురేంద్రరెడ్డి (30) బెంగళూరు విమానాశ్రయంలో సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్నాడు. సోమవారం వినాయక చవితి పండగ కావడంతో మిత్రునికి చెందిన బైక్ తీసుకుని దానిపై బెంగళూరు నుంచి స్వగ్రామానికి వచ్చాడు. రాత్రి సురేంద్రరెడ్డి మిత్రుని బైక్‌ను మదనపల్లెకు వెళ్లి ఇచ్చేందుకు ఎగువ శీతివారిపల్లె నుంచి బయలుదేరాడు. జాతీయ రహదారిపైకి వచ్చి మదనపల్లెకు వెళ్లే ప్రయత్నంలో ఖూనీతోపు వద్ద మలుపు తీసుకుంటుండగా.. ములకలచెరువు వైపు నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న టాటాఏస్ వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో రోడ్డుపక్కన మృతి చెందిన సురేంద్రరెడ్డిని గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఈ ప్రమాద ఘటనపై రోడ్డుపై వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలం చేరుకున్న ఎస్‌ఐ రామమోహన్ ప్రమాద తీరును పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

‘నా పిల్లల బాధ చూడలేను’..

- పోలియోతో మంచానికే పరిమితమైన పెద్ద కుమారుడు
- మరో కుమారుడు గుండెకి రంధ్రాలు
- పిల్లలపై దిగులుతో ఉరేసుకున్న తండ్రి ప్రసాద్
- తల్లడిల్లిపోతున్న భార్య, కుటుంబ సభ్యులు


ప్రసాద్ మృతదేహం


ముగ్గురు పిల్లలతో కలిసి విషాదంలో ఉన్న అనిత

ప్రొద్దుటూరు క్రైం : వారిది సామాన్య కుటుంబం. పనికి వెళ్తే గానీ రోజు గడవని పరిస్థితి. పని చేసుకుంటూ భార్యాభర్తలు సంతోషంగా ఉండేవారు. దేవుడు వారికి సంతానం ఇచ్చినా.. సంతోషమనేది లేదు. పోలియో సోకి ఒక కుమారుడు మంచానికి పరిమితమైతే.. మరో కుమారుడి గుండెకు రంధ్రాలు పడ్డాయి. పిల్లల ఆరోగ్యంపై బెంగ పెట్టుకున్న తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని నడింపల్లెకు చెందిన పోతినేని ప్రసాద్(32) ఆటో నడుపుకొని జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య అనిత తోపాటు శివసుశాంత్ (8), వెంకటదినేశ్వర్ (6) అనే కుమారులు, అఖిలేశ్వరి (3) అనే కుమార్తె ఉన్నారు. అతను ఆటో నడపడంతో పాటు లారీ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. ఆటోకు బాడుగలు సరిగా ఉండటం లేదని అందువల్ల లారీకి వెళ్తానని ప్రసాద్ ఇటీవల భార్యకు చెప్పాడు. అందుకు ఆమె నీ ఇష్టం అని చెప్పింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో లారీకి వెళ్తున్నానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భర్త లారీకి వెళ్తున్నాడేమోనని భార్య అనిత భావించింది. ఈ క్రమంలో శనివారం రాత్రి 11.50 సమయంలో ప్రసాద్ తన తల్లి రమణమ్మకు ఫోన్ చేసి ‘అమ్మా..! నేను బయట ఉన్నాను జాగ్రత్త’ అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. తర్వాత తల్లి, భార్య అతనికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 7.20 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఫోన్ చేసి పట్టణ శివారులోని ఆటోనగర్ పక్కన ఉన్న ప్లాట్లలో ప్రసాద్ ఉరేసుకొని మృతి చెందాడని చెప్పారు. దీంతో భార్య, కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లగా ప్రసాద్ ఒక చెట్టుకు చీర చుట్టుకొని ఉరేసుకొని ఉన్నాడు.

నా పిల్లలకు దేవుడు ఎందుకిలా చేశాడు..

కుమారుల ఆరోగ్య పరిస్థితి చూసి ప్రసాద్ దంపతులు మనోవేదనకు గురయ్యేవారు. పెద్ద కుమారుడు శివసుశాంత్‌కు పుట్టుకతోనే పోలియో సోకడంతో కాళ్లు, చేతులు సచ్చు బడ్డాయి. అంతేగాక అతను మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో సుశాంత్ మంచానికి పరిమితయ్యాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా బాబు ఆరోగ్యం నయం కాలేదు. మరో కుమారుడు వెంకటదినేశ్వర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇటీవలే ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెకు రంధ్రాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి ప్రసాద్, అనితలు ఆదోళన చెందసాగారు. ‘నా పిల్లలకే ఎందుకు దేవుడు ఇలా చేశాడు.. ఈ బాధ చూడటం కంటే చావడం మంచిది’ అని ప్రసాద్ ఇంట్లో చెబుతూ బాధ పడేవాడు. అలా మాట్లాడవద్దని ఎంత డబ్బైనా సుశాంత్‌ను ఆస్పత్రిలో చూపిద్దాంలే అని భార్య, ప్రసాద్ తల్లి రమణమ్మ ధైర్యం చెబుతూ వచ్చేవారు. ‘ఆస్పత్రికి వెళ్లాలనుకునే లోపే నా భర్త ఇంత ఘోరానికి పాల్పడ్డాడని’ భార్య రోదించసాగింది. ముగ్గురు పిల్లలను ఎలా పోషించుకోవాలి దేవుడా అంటూ ఆమె విలపిస్తోంది. రూరల్ ఎస్‌ఐ చిరంజీవి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవనగమనంలో విశ్వకర్మల పాత్ర విశిష్టమైంది


విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : మానవ జీవన గమనంలో విశ్వకర్మల పాత్ర విశిష్టమైనదని, మనిషికి కావాల్సిన కనీస వసతులైన వస్త్రాలు, కూడు, గూడు నిర్మాణంలో వారి పాత్ర ప్రాధాన్యత కలిగి ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారికంగా జరుపుతున్న సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. అతిథులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ హిందూ పురాణాలు విశ్వకర్మను స్వయంభువుగా, సృష్టికర్తగా వివరించాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామమన్నారు. సభాధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కంసాలి, కంచర, వడ్రంగి, కమ్మరి, స్థపతి పనులు వృత్తులుగా మారిన నేపథ్యాన్ని వివరించారు. గౌరవ అతిథి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతివృత్తి కళాకారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు వారు జీవితంలో ఆర్థికంగా స్థిరపడేందుకు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి లోన్లు మంజూరు చేస్తోందన్నారు. విశిష్ట అతిథి, విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వృత్తి కళాకారులు నైపుణ్యంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. మరో విశిష్ట అతిథి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీమ్ బాషా, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా వృత్తి కళాకారులైన ఆళ్లగడ్డకు చెందిన శారదా శిల్పకళామందిర్ నిర్వాహకురాలు భువనేశ్వరి, ధర్మపురి రామచంద్రాచారి, కనపర్తి రామచంద్రయాచారిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన వడ్రంగి, రంపం, ఉలి, సుత్తి, బాడిసె, చెక్కతో చేసిన వ్యాసపీఠం, మందసం, దేవతామూర్తుల శిల్పాలను చిన్నారులతోపాటు పెద్దలు కూడా ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ రిటైర్డ్ అధికారి గోపాల్, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కొండూరు జనార్దన రాజు, కరీముల్లా, కొత్తపల్లి రామాంజనేయులు, మురళి, శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యత


విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే , ఆర్‌టీసీ చైర్మన్

వల్లూరు : వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. వల్లూరు మండలంలోని దుగ్గాయపల్లె వద్ద 4 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33 /11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు వారు ఆదివారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడానికి అవసరమైన అన్ని రకాల చర్యలను ప్రభుత్వం చేపడుతోందని అన్నారు. ఇందులో భాగంగా అవసరమైన చోట్ల అదనంగా విద్యుత్ సబ్ స్టేషన్‌లను నిర్మించడమే కాక విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తోందని అన్నారు. దుగ్గాయపల్లెలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఈ చుట్టు పక్కల ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ సలహాదారు రాజోలు వీరారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జెడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, మాజీ జెడ్పీటీసీ పచ్చారు వెంకటేసు, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ కార్పొరేటర్ పుత్తా వెంకట సుబ్బారెడ్డి, పార్టీ నేతలు సిద్దారెడ్డి, శివకుమార్‌రెడ్డి, రాజారెడ్డి, శంకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన ‘దిశ’ పోలీసులు

కడప అర్బన్ : ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని దిశ పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. హైవేలో గూడ్స్ ఆటోలో వెళుతున్న తనను లారీ వచ్చి ఢీ కొట్టిందని బాధితుడు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో సహాయం చేసే వాళ్లు ఎవరూ లేకపోవడంతో దిశ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించానని పేర్కొన్నాడు. ఈ సంఘటన వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

ఈ సంఘటన పూర్తి వివరాలిలా వున్నాయి. వంశీకృష్ణ అనే వ్యక్తి ఖాజీపేట హైవేలో తన గూడ్స్ ఆటోలో వెళ్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఓ లారీ వేగంగా వచ్చి వంశీకృష్ణ గూడ్స్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణ తల, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. తన ఆటోను ఢీకొట్టి వెళుతున్న లారీ నంబర్‌ను గుర్తించి వంశీకృష్ణ వెళ్లి ప్రశ్నించే ప్రయత్నం చేశారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో వంశీకృష్ణ దిశా ఎస్‌ఓఎస్ కాల్ చేసి జరిగిన సంఘటన గురించి పోలీసులకు వివరించారు. ఖాజీపేట హైవేలో ఒంటరిగా ఇబ్బంది పడుతున్న వంశీకృష్ణ దగ్గరకు దిశా పోలీసులు కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వంశీకృష్ణను వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సను అందించారు. అనంతరం బాధితుడు చెప్పిన వివరాలను, లారీ నంబర్‌ను పోలీసులు నోట్ చేసుకున్నారు. బాధితుడు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని ఖాజీపేట పోలీసులు స్పష్టం చేశారు. ప్రమాదంలో గాయపడిన తనను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించడంతో పాటు న్యాయం చేస్తామని భరోసాను కల్పించిన దిశ పోలీసులకు బాధితుడు వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం

పులివెందుల టౌన్ : వడ్డెర్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయ ప్రాధాన్యత కల్పించిందని శాసనమండలి సభ్యులు చంద్రగిరి యేసురత్నం పేర్కొన్నారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని విజయగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గ్రేటర్ రాయలసీమ వడ్డెరుల మేధోమథన సదస్సును నిర్వహించారు. వడ్డెర సంక్షేమ సంఘ అధ్యక్షులు, సమన్వయకర్త డాక్టర్ వల్లెపు వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం, ఉద్యోగ సంఘాల గౌరవ సలహాదారుడు శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరులకు ఎదురౌతున్న సామాజిక, ఆర్థిక అంశాలపై మేధోమథన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. గ్రేటర్ రాయలసీమలో 10 జిల్లాలు, 67 నియోజకవర్గాలు, 28 మున్సిపాలిటీలు, 287 మండలాల వడ్డెరుల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదుకోవాలన్నారు. ఆంధ్రరాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు బత్తల వెంకటరమణ మాట్లాడుతూ వడ్డెరులకు ఆశ్రమ పాఠశాలల ద్వారా విద్యను అందించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు భీమా, పారితోషికం అందించి ఆదుకోవాలన్నారు. ఉమ్మడి వడ్డెర సంఘం అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ వడ్డెరులు 5 వేల నుంచి 75 వేల ఓటు బ్యాంకు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. వడ్డెరులు విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో వెనుకబడ్డారని, వారికి అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వడ్డెరుల సమస్యలపై నాయకులు చర్చించారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జీడీఏ నాగన్న, అనంతపురం జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు వడ్డె వెంకట్, ఓసీసీఐ రాష్ట్ర అధ్యక్షులు గొద్దలి వెంకటేశు, కర్నూలు జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తల లక్ష్మయ్య, ఉద్యోగ సంక్షేమ సంఘాల రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు దేరంగుల ఆంజనేయులు, చిత్తూరు జిల్లా రేపనముని, దేరంగుల ప్రశాంత్, కొండయ్య, రమణ, కిశోర్, చంద్రమౌళి, చలం, చలపతి, నగేష్, లోకేష్, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, నంద్యాల, తిరుపతి, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు జిల్లాల వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ


ఆదోని జడ్జితోపాటు మరో ఇద్దరికి గాయాలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామ సమీపాన ఆదివారం కారును లారీ ఢీకొనడంతో ఆదోని సీనియర్ సివిల్ జడ్జి శైలజాతోపాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని కౌతాళం గ్రామానికి చెందిన శైలజా ఆదోని సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె తల్లితో కలిసి కారులో కడప వైపు వెళ్తుండగా ఎదురుగా ఎర్రగుంట్ల వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో కారు డ్రైవరు తలారీ సుధాకర్, జడ్జి శైలజా, ఆమె తల్లి వెంకటసుబ్బమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారు కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు డ్రైవర్ తలారీ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మదనపల్లెలో కిడ్నాప్ కలకలం

మదనపల్లె : పట్టణ పరిధి అమ్మచెరువుమిట్టలోని ఆర్‌కే టైల్స్ యజమాని శ్రావణ్‌కుమార్‌ను ఆదివారం కడపకు చెందిన కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారన్న విషయం కలకలం రేపింది. కడపకు చెందిన ముగ్గురు వ్యాపారులు 15 మందితో కలిసి రెండు వాహనాల్లో ఆర్‌కే టైల్స్ యజమాని శ్రావణ్‌కుమార్, బావమరిది రమేష్‌ను కొట్టుకుంటూ తీసుకెళ్లిపోయారన్న వార్త దావానలంలా వ్యాపించింది. తమ పార్ట్‌నర్, అతడి బావమరిది కిడ్నాప్‌కు గురయ్యారంటూ ఆర్‌కే టైల్స్ నగేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా సమాచారం అందించి నిఘా పెట్టారు. ఎట్టకేలకు గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితులు కిడ్నాప్ చేసిన వ్యక్తులతో సహా పోలీసులకు దొరికిపోయారు. పట్టణంలో సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో అమ్మచెరువుమిట్ట వద్ద శ్రావణ్‌కుమార్, నగేష్‌లు ఆర్‌కే టైల్స్ పేరుతో టైల్స్ వ్యాపారం చేస్తున్నారు. వీరు గుజరాత్ నుంచి టైల్స్ తెప్పించి, స్థానికంగా హోల్‌సేల్ ధరకు విక్రయిస్తుంటారు. కడప జిల్లాకు చెందిన నాగబసిరెడ్డి, సునీల్‌రెడ్డి, లోకేష్‌రెడ్డిలు రాయచోటి, కడపలో టైల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరు గుజరాత్ నుంచి టైల్స్ పెద్ద మొత్తంలో తెప్పించుకుని, అక్కడి వ్యాపారులకు డబ్బులు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో వ్యాపార లావాదేవీల్లో భాగంగా గుజరాత్‌కు వెళ్లిన ఈ ముగ్గురిని అక్కడి వ్యాపారులు మూకుమ్మడిగా నిర్బంధించి తమకు రావాల్సిన బాకీని వసూలు చేసుకున్నారు. దీనిని కడప వ్యాపారులు అవమానంగా భావించారు. తమకు గుజరాత్‌లో అవమానం జరిగేందుకు మదనపల్లెకు చెందిన ఆర్‌కే టైల్స్ యజమానులు శ్రావణ్‌కుమార్, నగేష్‌లు కారణమని, తమ సమాచారాన్ని వారికి అందించినందునే తాము ఇబ్బందులు పడ్డామని వీరిపై కక్ష పెంచుకున్నారు. దీంతో ఆదివారం సాయంత్రం కడప వ్యాపారులు రెండు వాహనాల్లో 15 మందిని వెంటపెట్టుకుని మదనపల్లె ఆర్‌కే టైల్స్ వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో శ్రావణ్‌కుమార్, అతడి బావమరిది రమేష్ షాపులో ఉన్నారు. తమ సమాచారం గుజరాత్ వ్యాపారులకు అందించి తమకు రూ.30 లక్షల వరకు నష్టం కలిగించారని, ఆ డబ్బులు మీరే చెల్లించాలంటూ ఇద్దరినీ బెదిరించారు. ఖాళీ బాండుపేపర్లపై రూ.30 లక్షలు బాకీ ఉన్నట్లు సంతకాలు పెట్టాల్సిందిగా ఒత్తిడి తెచ్చారు. వారు ససేమిరా అనడంతో ఎలా ఇవ్వరో చూస్తామంటూ మరో యజమాని నగేష్‌కు ఫోన్ చేసి.. ఇద్దరినీ కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నామని, డబ్బులు ఇచ్చి విడిపించుకోవాల్సిందిగా చెప్పారు. దీంతో నగేష్ వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషాకు ఫిర్యాదు చేయడం, ఆయన డీఎస్పీ కేశప్ప దృష్టికి తీసుకెళ్లడంతో అప్రమత్తమై జిల్లా ఎస్పీకి సమాచారం అందించి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. వాహన తనిఖీలు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో గుర్రంకొండ వద్ద వాహన తనిఖీల్లో కిడ్నాపర్లు వాహనాలతో సహా పోలీసులకు దొరికిపోయారు. అక్కడ నుంచి వారిని మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కిడ్నాప్ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అరెస్ట్ చేయడంతో కథ సుఖాంతమైంది.

గద్దర్ పాట అజరామరం


మాట్లాడుతున్న విరసం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీఎస్ఆర్ ప్రసాద్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజల కష్టాలు, శ్రమను గద్దర్ తన పాటలో వినిపించారని, ఆయన పాట అజరామరం అని విరసం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ప్రొద్దుటూరు మార్కెట్‌యార్డులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభకు కవి మహమూద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో జననాట్య మండలి ఏర్పడిందని తెలిపారు. జననాట్యమండలిలో గాయకుడిగా ఉన్న విఠల్ గద్దర్‌గా మారడం వెనుక విప్లవోద్యమ కృషి ఉందని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ సమాజంలో అసమానతలు ఉన్నంత వరకు ప్రజా ఉద్యమాలు ఉంటాయన్నారు. ఉద్యమాలు ఉన్నంత కాలం గద్దర్ పాట బతికే ఉంటుందని తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సమాజం ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను మరిచిపోలేదన్నారు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి జయరాం తన పాటతో గద్దర్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మా భూమి సంధ్యక్క జననాట్యమండలిలో ఉన్నప్పుడు గద్దర్‌తో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. ప్రజా కళామండలి జాన్ రాణి, నాగేశ్వరరావు బృందం గద్దర్ పాటలను పాడి సభికుల్లో ఉత్తేజాన్ని నింపారు. కార్యక్రమంలో విరసం వరలక్ష్మి, పీకేఎం జిల్లా కన్వీనర్ శ్రీను, పల్లవోలు రమణ, వడ్ల లక్ష్మీదేవి, హరిత, యల్లయ్య పాల్గొన్నారు.